సాక్షి విశాఖపట్నం

బుధవారం | 15 | ఫిబ్రవరి | 2023



ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ మల్లికార్జున ఆదేశించారు. 8లో



సింహగిరిపై 'ఆర్‌సీ 15'

శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న 'ఆర్‌సీ 15' చిత్ర షూటింగ్ సింహగిరిపై జరిగింది. 8లో



అప్పికొండలో ర్యాష్ డ్రైవింగ్

అప్పికొండ తీరంలో ర్యాష్ డ్రైవింగ్ చేసి, భయాందోళనకు గురి చేసిన యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 8లో

న్యూస్‌రీల్

27న వీఎంఆర్‌డీఏ ప్లాట్లకు ఈ వేలం

దొండపర్తి(విశాఖ దక్షిణ): వీఎంఆర్‌డీఏ గతంలో అభివృద్ధి చేసిన లేఅవుట్లలో మిగిలి ఉన్న 37 ఖాళీ ప్లాట్ల విక్రయానికి ఈ నెల 27వ తేదీన ఈ–వేలం నిర్వహిస్తున్నట్లు మెట్రోపాలిటన్ కమిషనర్, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. కూర్మన్నపాలెం ఫేజ్–1, 2, 6, పెద గంట్యాడలో ఫేజ్–1, 2, 3, మద్రిపాలెం లేఅవుట్, మధురవాడ సైబర్ వ్యాలీ, భీమిలిలో చిలుకూరి జాయింట్ వెంచర్, డాక్టర్ పద్మావతి జాయింట్ వెంచర్, విజయనగరంలో కనపాక అయ్యన్నపేట లేఅవుట్లలో నివాస అవసరాలకు అనువైన ఎల్‌ఐజీ, ఎంఐజీ, హెచ్‌ఐజీ ప్లాట్లను విక్రయించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల వారు ఈ నెల 15వ తేదీ నుంచి 24వ తేదీలోగా ఈ–పోర్టల్ https://konugolu.ap.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 27వ తేదీన జరగనున్న ఈ–ఆక్షన్‌లో పాల్గొనాలన్నారు. ఈ పోర్టల్‌లో నమోదు చేసుకొనేందుకు అవగాహన లేని వారి కోసం వీఎంఆర్‌డీఏ ప్రధాన కార్యాలయం 3వ అంతస్తులో సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.95 కోట్లు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం 41 రోజులకు గాను కోటి 95లక్షల 38వేల 602 రూపాయలు వచ్చినట్లు ఈవో వి.త్రినాథరావు తెలిపారు. సింహగిరిపై స్వామివారి బేడామండపంలో మంగళవారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. నగదుతో పాటు 135.500 గ్రాముల బంగారం, 12.060 కిలోల వెండి లభించినట్టు పేర్కొన్నారు. దేవస్థానం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గృహిణులకు స్పోకెన్ ఇంగ్లిష్‌లో ఉచిత శిక్షణ

సీతంపేట: గృహిణులకు స్పోకెన్ ఇంగ్లిష్‌లో రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు గృహిణి స్పోకెన్ ఇంగ్లిష్ స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకుడు డి.మనోహర్ తెలిపారు. రామా టాకీస్ సమీపంలో కెనరా బ్యాంకు ఎదురుగా శ్రీకృష్ణా ట్రావెల్స్ మేడ మీద ఉన్న సంస్థ కార్యాలయంలో ఈనెల 23 నుంచి ఏప్రిల్ 23 వరకు ప్రతి రోజూ ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. శిక్షణ కోసం ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని, ఆసక్తి గల గృహిణులు ఇన్‌స్టిట్యూట్‌కు వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 80193 88999లో సంప్రదించాలన్నారు.


ధ్రువీకరణ పత్రాలు సిద్ధం చేసుకోవాలి

విశాఖ విద్య: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష రాసిన అభ్యర్థులు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను సిద్ధం చేసుకోవాలని డీఈవో ఎల్. చంద్రకళ తెలిపారు. ఈ నెల 5న జరిగిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులు తప్పనిసరిగా వెబ్‌సైట్‌లో ధ్రువీకరణ పత్రాలను నమోదు చేయాలన్నారు. హాల్ టిక్కెట్, 7వ తరగతి మార్కుల ఉత్తీర్ణత శాతం, అంగవైకల్యం ఉన్న విద్యార్థులు, అందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రం వంటి వాటిని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఈ నెల 20లోపు వీటిని వెబ్‌సైట్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ విషయంపై పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

రేపటి నుంచి రోలర్‌స్కేటింగ్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: అంతర వర్సిటీల రోలర్ స్కేటింగ్ పోటీలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏయూ ఆధ్వర్యంలో స్కేటింగ్ సంఘం పర్యవేక్షణలో స్పీడ్, రోడ్, రింక్ స్కేటింగ్‌లతో పాటు ఆర్టిస్టిక్ విభాగంలోనూ వ్యక్తిగత విభాగాల్లో పోటీలు జరగనున్నాయి. వీఎంఆర్‌డీఏ పార్క్‌లోని రింక్‌లతో పాటు బీచ్‌రోడ్‌లో రేస్‌లు నిర్వహించనున్నారు. స్కేట్ బోర్డు, రోలర్‌హాకీ, ఇన్‌లైన్‌హాకీ టీమ్ ఈవెంట్లు మీట్‌లో భాగంగా జరగనున్నాయి.

సింహాద్రి ఎన్టీపీసీకి రెండు అవార్డులు



అవార్డు స్వీకరిస్తున్న సీజీఎం సిన్హా

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీకి రెండు అవార్డులు లభించాయి. ఐపీఎస్–2023 సమయంలో సిస్టమ్ అమలు, అభివృద్ధికి కృషి చేసినందుకు బీఈ 2020–21 అవార్డు, 9వ వార్షిక హీట్ రేట్ 2020–21 అవార్డులు దక్కాయి. రాయ్‌పూర్ సింహాద్రిలో మంగళవారం జరిగిన ఓ అండ్ ఎం కాన్ఫరెన్స్‌లో ఆపరేషన్ ఈడీ చటోపాధ్యాయ నుంచి సంస్థ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా ఈ అవార్డులు స్వీకరించారు.

పర్యాటకుల భద్రతే లక్ష్యం

- టూరిస్ట్ పోలీస్‌స్టేషన్లతో విప్లవాత్మక మార్పు
- నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్
- బీచ్‌రోడ్డులో టూరిస్ట్ పోలీస్‌స్టేషన్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం జగన్



బీచ్ పెట్రోలింగ్ వాహనాన్ని నడుపుతున్న సీపీ శ్రీకాంత్

బీచ్‌రోడ్డు: పర్యాటకుల భద్రతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన టూరిస్ట్ పోలీస్‌స్టేషన్లు.. పోలీస్ శాఖలో ఓ విప్లవాత్మక మార్పు అని నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్ అన్నారు. ఆర్.కె.బీచ్‌లో ఏర్పాటు చేసిన టూరిస్ట్ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించిన కమిషనర్ మాట్లాడారు. ఈ స్టేషన్లతో పర్యాటకులకు భద్రత పెరుగుతుందని.. తద్వారా టూరిజం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. తీర ప్రాంతాల్లో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. విశాఖకు ఏటా 1.10 కోట్ల మంది పర్యాటకులు వస్తుంటారని.. వారికి భద్రతకు టూరిస్ట్ పోలీస్ వ్యవస్థ ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. డీసీపీలు సుమిత్ సునీల్ గరుడ్, ఆనంద్ రెడ్డి, పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

లారస్ కంపెనీ సామాజిక బాధ్యత

సాగరతీరానికి వచ్చే సందర్శకులకు మరింత భద్రత ఇచ్చేందుకు లారస్ కంపెనీ ముందుకొచ్చింది. సీఎస్‌ఆర్‌లో భాగంగా రెండు బీచ్ పెట్రోలింగ్ మినీ ట్రాక్టర్లు, 10 ద్విచక్ర వాహనాలను టూరిస్ట్ పోలీస్‌స్టేషన్‌కు అందజేసింది. ఓ ట్రాక్టర్ ఆర్.కె.బీచ్‌కు, మరొకటి సాగర్‌నగర్‌కు కేటాయించారు.

అందుబాటులోకి రోబోటిక్ గార్డ్

కెరటాల్లో చిక్కుకున్న సందర్శకులను రక్షించేందుకు ఆర్.కె.బీచ్‌లో రోబోటిక్ గార్డును అందుబాటులోకి తీసుకొచ్చారు. రిమోట్ సహాయంతో నడిపే ఈ రోబొటిక్‌తో ప్రమాదకరమైన కెరటాల్లో సైతం బాధితులను రక్షించవచ్చు.

బాధితులకు రక్షణగా..



సముద్రంలో స్నానాలు చేస్తూ కెరటాల్లో చిక్కుకున్న సందర్శకులను రక్షించేందుకు లైఫ్‌గార్డ్స్‌కు కొంత సమయం పడుతుంది. అదే ఈ బీచ్ పెట్రోలింగ్ వాహనాల ద్వారా సమాచారం అందిన వెంటనే మినీ ట్రాక్టర్‌పై ప్రమాద స్థలికి చేరుకుని బాధితులను రక్షించవచ్చు. తద్వారా ప్రమాదాల సంఖ్య తగ్గే అవకాశం ఉంటుంది. ఈ ట్రాక్టర్‌లో ఇద్దరు లైఫ్ గార్డులు, స్పీకర్లు, సెఫ్టీ జాకెట్లు, తాడు, సెఫ్టీ బెలూన్ ఉంటుంది.

సేవలన్నీ ఒకే చోట

టూరిస్ట్ పోలీస్‌స్టేషన్ ద్వారా నగరానికి వచ్చే పర్యాటకులకు అన్ని సేవలు ఒకే చోట లభిస్తాయి. ఆరుగురు సిబ్బందితో పాటు ఓ ఏఎస్‌ఐ స్థాయి పర్యవేక్షణలో ఈ పోలీస్‌స్టేషన్ సేవలందిస్తుంది. పర్యాటకుల ఫిర్యాదులపై అక్కడే ఎఫ్‌ఐఆర్ నమోదు చేస్తారు.పర్యాటక ప్రాంతాలు, ఆటో, కారు సర్వీసుల వివరాలను ఈ స్టేషన్‌కు అనుసంధానం చేయనున్నారు.

రెండు హెల్ప్‌లైన్లు ఏర్పాటు

పర్యాటకులకు ఇబ్బందులు ఎదురై.. నేరుగా రాలేని పరిస్థితిలో ఉన్న వారికి సేవలందించేందుకు రెండు హెల్ప్‌లైన్ నంబర్లు ఏర్పాటు చేశారు. 94906 17924 లేదా 94933 36633 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. పర్యాటకుల సమస్యలను అర్థం చేసుకుని.. వారికి మనోధైర్యం అందించే విధంగా సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు.

శాస్త్రీయ దృక్పథంతో కొత్త ఆవిష్కరణలు

- కలెక్టర్ మల్లికార్జున
- జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం



ప్రాజెక్ట్ గురించి తెలుసుకుంటున్న కలెక్టర్ మల్లికార్జున

విశాఖ విద్య: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు. కేడీపీఎం ఉన్నత పాఠశాల ప్రాంగణంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను మంగళవారం కలెక్టర్ మల్లికార్జున ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సరికొత్త ఆవిష్కరణల వైపు ఆలోచనలు చేయాలన్నారు. సైన్సు సంబంధిత ప్రయోగాల్లో రాణించాలన్నారు. పౌరుడు తన విధులను సక్రమంగా నిర్వర్తించాలని, ఓ విషయాన్ని తీసుకునేటప్పుడు అందులో శాస్త్రీయ కోణాన్ని గ్రహించాలన్నారు. ఆసక్తి ఉన్న రంగాల్లో విద్యార్థులను భాగస్వాములను చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. వివిధ అంశాల్లో నిర్వహించే పోటీల్లో విద్యార్థులు తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. పోటీలో భాగస్వామ్యులు కావడం ముఖ్యమని, విజయం దానంతట అదే వస్తుందన్నారు. విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఎం.జ్యోతికుమారి మాట్లాడుతూ నిజ జీవితంలో సైన్సు ప్రభావం ఎంతో ఉంటుందన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ మాట్లాడుతూ వైజ్ఞానిక ప్రదర్శనల్లో పాల్గొనటం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. సైన్సు పట్ల ఆసక్తి పెంచుకుని నూతన ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన 300 మంది విద్యార్థులు ఇందులో భాగస్వామ్యులు కాగా, 110 ప్రాజెక్టులను ప్రదర్శించారు. బుధవారం కూడా వైజ్ఞానిక ప్రదర్శన ఉంటుందని, ఉత్తమ 10 ప్రాజెక్టులను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని జిల్లా సైన్సు అధికారి ఎం.వి.విశ్వేశ్వరరావు తెలిపారు. ఎస్‌ఎస్‌ఏ ఏపీసీ శ్రీనివాసరావు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఎనిమిదేళ్లలో 16 వేల పోస్టుల భర్తీ

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వేలో గత ఎనిమిది సంవత్సరాల్లో రైల్వే రిక్రూట్‌మెంట్ డ్రైవ్స్ ద్వారా సుమారు 16,405 పోస్టులను భర్తీ చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. భద్రతకే రైల్వే అధిక ప్రాధాన్యమిస్తోందని, ఈస్ట్ కోస్ట్ రైల్వే ఎప్పటికప్పుడు సిబ్బంది విషయంలో జాగ్రత్తలు తీసుకుంటూ అవసరమైన పోస్టులను భర్తీ చేస్తుందన్నారు. మరో 2,858 ఖాళీలను భర్తీ చేసేందుకు తుది దశ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.

మానసిక రోగులకు మెరుగైన చికిత్స

మహారాణిపేట: మానసిక రోగులకు మెరుగైన చికిత్స అందించడం ద్వారా కౌమార దశలో ఉన్న వారిని కాపాడవచ్చని కలెక్టర్ మల్లికార్జున అన్నారు. మానసిక వైద్యశాలలో కౌమార మనోరోగ చికిత్స సూపర్ స్పెషాలిటీ వైద్య కౌంటర్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అప్పుడే జన్మించిన బిడ్డ నుంచి 18 ఏళ్లలోపు పిల్లలకు మనోరోగ చికిత్సకు సంబంధించి వైద్యం అందిస్తామన్నారు. రోగులకు ఆహ్లాదకర వాతావరణంలో వైద్యం అందించాలన్నారు. అనంతరం అనసూయ (ఫ్యామిలీ) వార్డును పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డా.పి.అశోక్ కుమార్, మానసిక వైద్యశాల సూపరింటెండెంట్ జి.సురేష్ కుమార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందే



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న డీటీసీ రాజారత్నం, పోలీస్ అధికారులు



బైక్ రైడ్ ర్యాలీ

బీచ్‌రోడ్డు: 'మన భద్రత మన బాధ్యత' అని, అందుకు అందరూ కచ్చితంగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని డీటీసీ రాజారత్నం అన్నారు. మంగళవారం బీచ్‌రోడ్డులో 'బైక్ రైడర్ అండ్ హెల్మెట్ ర్యాలీ' నిర్వహించారు. ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారం రోజులుగా నగరంలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు. అతివేగంగా, అకతాయంగా, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. బైక్ డ్రైవ్ చేసినప్పుడు ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఐఎస్‌ఐ మార్క్ ఉన్న వాటిని మాత్రమే వినియోగించాలన్నారు. కారు డ్రైవ్ చేస్తున్నప్పుడు సీటు బెల్ట్ పెట్టుకోవాలన్నారు.

ఇన్ఫోసిస్‌కు ముహూర్తం

- మే 31న ప్రారంభం
- 650 మందితో ఆరంభం
- రుషికొండ సిగ్నిటివ్ టవర్‌లో కార్యకలాపాలు
- ప్రకటించిన సంస్థ యాజమాన్యం



రుషికొండలోని ఇన్ఫోసిస్ సిగ్నిటివ్ టవర్

సాక్షి, విశాఖపట్నం: దిగ్గజ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ విశాఖలో పూర్తి స్థాయి కార్యకలాపాలు మొదలు పెట్టడానికి ముహూర్తం ఖరారైంది. ఇప్పటికే రుషికొండ ఐటీ సెజ్ (హిల్ నెం.2)లో ఉన్న మహతి సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌లో గత అక్టోబర్ ఒకటిన ఇన్ఫోసిస్ శాటిలైట్ కార్యాలయాన్ని తెరవాలని భావించింది. అక్కడ అందుకు అనుకూలత లేకపోవడంతో అప్పట్నుంచి సాంకేతికంగా తగినన్ని వసతులు, సదుపాయాలు, ప్రమాణాలున్న భవనం కోసం అన్వేషిస్తోంది. ఇప్పుడు రుషికొండ ఐటీ సెజ్‌లోని సిగ్నిటివ్ టవర్‌ను ఎంపిక చేసుకుంది. అక్కడ నుంచి మే 31న కార్యకలాపాలు ప్రారంభించనున్నట్టు ఇన్ఫోసిస్ సంస్థ తాజాగా ప్రకటించింది. తొలిదశలో 650 మంది ఉద్యోగులు విధుల నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపింది. రానున్న మూడేళ్లలో మూడు వేల మంది ఉద్యోగులకు విస్తరించనుంది. మూడు అంతస్తుల్లో ఉన్న ఈ సిగ్నిటివ్ టవర్ 97 వేల చదరపు అడుగుల విస్తీర్ణం కలిగి ఉంది. విశాలమైన పార్కింగ్ సదుపాయం కూడా ఉంది.

సకల సదుపాయాల కల్పన

ప్రభుత్వం ఇన్ఫోసిస్ సంస్థ ఏర్పాటుకు అవసరమైన అన్ని సదుపాయాలు, వనరులను సమకూర్చడంతో పాటు సహకారాన్ని అందజేస్తోంది. నగరం నుంచి రుషికొండ ఐటీ సెజ్‌కు తమ సంస్థ ఉద్యోగులు రాకపోకలు సాగించడానికి వీలుగా ఆర్టీసీ బస్సులను నడపాలని గతంలో కోరింది. ఇందుకు ఆర్టీసీ అధికారులు సమ్మతించారు. ఐటీ కంపెనీల్లో ఉద్యోగులు షిఫ్టుల వారీగా విధులు నిర్వహిస్తారు. అందువల్ల 24 గంటలూ ఆర్టీసీ బస్సు సర్వీసులు వీరికి అందుబాటులో ఉండేలా చూడనున్నారు. అలాగే భీమిలి వెళ్లే బీచ్ రోడ్డు నుంచి ఐటీ సెజ్‌కు వెళ్లే రోడ్డు మరింత మెరుగు పరచడంతో పాటు మరమ్మతులు చేపడుతున్నారు. రాత్రి వేళల్లో రాకపోకలు సాగించే ఐటీ ఉద్యోగులు ఇబ్బంది పడకుండా ఈ రోడ్డుకిరువైపులా పూర్తి స్థాయిలో ఆధునిక వీధి లైట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇక ఐటీ సెజ్‌కు వెళ్లే దారిలో భద్రతపై కూడా జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. ఆ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలను, ఆకతాయిలు, తాగుబోతులు, అల్లరి మూకల ఆగడాలకు అవకాశం లేకుండా పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం పోలీసులతో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించనున్నారు. దీంతో ఇన్ఫోసిస్‌తో పాటు ఐటీ సెజ్‌లో విధులు నిర్వహించడానికి వెళ్లి వచ్చే ఉద్యోగినులు ఎలాంటి భయాందోళనలకు ఆస్కారం లేకుండా చూస్తారు. త్వరలో విశాఖ క్యాంపస్ నుంచి కార్యకలాపాలు ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లను వేగవంతం చేసే పనిలో పరిశ్రమలు, ఐటీ శాఖల అధికారులున్నారు.

ఉత్తరాంధ్ర పట్టభద్రులు 2,87,258

- ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల తుది జాబితా ప్రకటన
- ఓటర్లలో పురుషులే అధికం



విశాఖ కలెక్టరేట్

మహారాణిపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితాను ప్రకటించారు. తుది ఓటర్ల నమోదు కార్యక్రమం సోమవారంతో ముగియగా.. మంగళవారం నాటికి మొత్తం ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో 2,87,258 మంది ఓటర్లు ఉన్నారు. ఓటర్లు జాబితా సవరణ ప్రక్రియ పూర్తి కావడంతో తుది ఓటర్ల జాబితా ప్రకటించారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీకి వచ్చే నెల 13న ఎన్నిక నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. మొత్తం 2,87,258 మంది ఓటర్లలో పురుషులు 1,80,891, మహిళలు 1,06,329, ట్రాన్స్‌జెండర్లు(టీజీ) 38 మంది ఉన్నారు.

జిల్లాల వారీగా ఓటర్ల వివరాలివీ..

జిల్లా పేరు	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్	మొత్తం
శ్రీకాకుళం	36,361	15,830	05	52,196
విజయనగరం	38,556	19,817	09	58,382
పార్వతీపురం మన్యం	12,399	5,959	02	18,360
అల్లూరి సీతరామరాజు	7,894	3,674	03	11,571
విశాఖపట్నం	58,105	47,117	13	1,05,235
అనకాపల్లి	27,576	13,932	06	41,514
మొత్తం	1,80,891	1,06,329	38	2,87,258

త్వరలో ఆటో చార్జీల చార్ట్

- నగరంలో దూరాన్ని బట్టి నిర్దిష్టమైన చార్జీ
- అన్ని శాఖలు, ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్ల సమన్వయంతో నిర్ణయం
- ఏడీసీపీ(ట్రాఫిక్) ఆరిఫుల్లా వెల్లడి



ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లతో మాట్లాడుతున్న ఏడీసీపీ(ట్రాఫిక్) ఆరిఫుల్లా

దొండపర్తి(విశాఖ దక్షిణ): ఆటోల్లో ప్రయాణించే వారి నుంచి కచ్చితమైన ఛార్జీలను మాత్రమే తీసుకోవాలని ఏడీసీపీ(ట్రాఫిక్) ఆరిఫుల్లా ఆటో డ్రైవర్లకు సూచించారు. నగరంలో కొంత మంది ఆటోడ్రైవర్లు ఎక్కువ మొత్తంలో ఛార్జీలను వసూలు చేస్తూ ప్రయాణికులను ఇబ్బందులు పెడుతున్నారన్న విషయం నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ దృష్టికి వచ్చింది. దీంతో సీపీ ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఏడీసీపీ మంగళవారం ఆటో యూనియన్ నాయకులు, ఆటోడ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల నుంచి నిర్దిష్టమైన ధరను మాత్రమే తీసుకోవాలని, వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని నాయకులను, డ్రైవర్లను కోరారు. నగరంలో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ఎంత మేర చార్జీ వసూలు చేయవచ్చన్న విషయంపై రవాణా శాఖ, ఆటోయూనియన్లు, వివిధ శాఖల సమన్వయంతో తగిన రేట్లతో ఒక చార్ట్ రూపొందించడం జరుగుతుందని తెలిపారు. వాటిని ప్రతి ఆటోలోను, బస్టాండ్‌లోను, రైల్వేస్టేషన్ వద్ద, వివిధ జంక్షన్లలో ప్రయాణికుల సౌకర్యార్థం ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు. ప్రయాణికుల నుంచి ఎక్కువ మొత్తంలో ఛార్జీలు వసూలు చేసే వారిపై మోటార్ వాహనాల చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డీసీపీ(క్రైం) జి.నాగన్న, ఏసీపీ ట్రాఫిక్ జోన్–1 వి.భీమారావు, జోన్–2 ఏసీపీ శరత్ రాజ్‌కుమార్, ట్రాఫిక్ సీఐలు సి.హెచ్.సూరి నాయుడు, సి.హెచ్.షణ్ముఖ్, ఎంవీఐ ఎ.ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

- ఉమ్మడి విశాఖలో 207 కేంద్రాలు ఏర్పాటు
- విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు
- ఈ నెల 20 నుంచి పరీక్షలు ఆరంభం
- డీఆర్వో శ్రీనివాసమూర్తి సమీక్ష



మాట్లాడుతున్న డీఆర్వో శ్రీనివాసమూర్తి

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి తెలిపారు. పరీక్షల నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలు ప్రారంభమవుతున్నందున సంబంధిత విభాగాల అధికారులంతా కేంద్రాల్లో పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు అవసరమైన బస్సులను అందుబాటులో ఉంచాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. పరీక్షలు జరిగే రోజుల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని ఏపీఈపీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. అన్ని కేంద్రాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, అత్యవసర సమయంలో తగిన వైద్యం అందించేందుకు అవసరమైన ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్యశాఖాధికారులకు సూచించారు. తాగునీటి సదుపాయం, శానిటేషన్ పనులను ఎప్పటికప్పుడు నిర్వహించేలా జీవీఎంసీ అధికారులకు దిశానిర్దేశం చేశారు. సంబంధిత విభాగాల అధికారులంతా సమన్వయంతో పనిచేసి, ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు పూర్తయ్యేందుకు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

నైతిక విలువల పరీక్ష నేడు

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో భాగంగా బుధవారం ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆర్ఐవో ఉమారాణి తెలిపారు. అదేవిధంగా ఈ నెల 17న ఎన్విరాన్మెంటల్ పరీక్ష ఉంటుందన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష ఉంటుందని, వార్షిక పరీక్షలకు నమోదు చేసుకున్న విద్యార్థులంతా తప్పనిసరిగా వీటికి హాజరుకావాలని సూచించారు. విద్యార్థులు వారు చదువుకున్న కాలేజీల్లోనే పరీక్ష రాసే అవకాశం ఉందని ఆమె తెలిపారు.

207 కేంద్రాల్లో ప్రాక్టికల్ పరీక్షలు

ఈ నెల 20 నుంచి మార్చి 7 వరకు జరిగే ప్రాక్టికల్స్ పరీక్షలకు విశాఖలో 126, అనకాపల్లిలో 65, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 16 కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ నెల 20 నుంచి ఒకేషనల్ కోర్సు, 26 నుంచి జనరల్ కోర్సులకు చెందిన విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని 355 జూనియర్ కాలేజీల్లో చదువుతున్న బైపీసీ విద్యార్థులు 16,439 మంది, ఎంపీసీ గ్రూపు నుంచి 4,840 మంది ప్రాక్టికల్ పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో విశాఖ, అనకాపల్లి డీవీఈవోలు రాయల సత్యనారాయణ, బి.సుజాత, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంకల్ప్ క్రీడా దినోత్సవం



నైపుణ్యాలు ప్రదర్శిస్తున్న ప్రత్యేక బాలలు

విశాఖ స్పోర్ట్స్ : ప్రత్యేక విద్యార్థుల సలహా కేంద్రం సంకల్ప్ వార్షిక క్రీడాదినోత్సవం ఉత్సాహంగా సాగింది. సంప్రదాయక లైట్‌టార్చ్‌తో ప్రారంభమైన ఈ కార్యక్రమం అనంతరం ఎనర్జిటిక్, ఏరోబిక్ డ్రిల్‌ను విద్యార్థులు ప్రదర్శించారు. బడ్డీ రేస్, వీల్‌చైర్ రేస్‌లు నిర్వహించారు. సంకల్ప్, నేవీ వెల్ఫేర్, వెల్నెస్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు ఈఎన్‌సీ సీఎస్‌ఓ రియర్ అడ్మిరల్ సందీప్ ప్రధాన్, సప్నా ప్రధాన్, కో–ఆర్డినేటర్ సహారా, కమోడోర్ ఆర్.బిందురాజ్ హాజరయ్యారు.

హెల్మెట్ లేదా.. ప్లకార్డులు పట్టాల్సిందే..!



హెల్మెట్ ధరించని వారికి జరిమానాలు విధిస్తున్నప్పటికీ కొంత మంది తీరు మాత్రం మారడం లేదు. దీంతో పోలీసులు హెల్మెట్ ప్రయోజనాలను అందరికీ తెలిసేలా చేస్తున్నారు. హెల్మెట్ ధరించకుండా ప్రయాణించే వాహనచోదకులతో 'హెల్మెట్ వాడండి, సురక్షితంగా ప్రయాణించండి' అని రాసి ఉండే ప్లకార్డులు పట్టించి ప్రదర్శనలు చేయిస్తున్నారు. మంగళవారం మద్దిలపాలెం జంక్షన్ వద్ద ఈ విధంగా అవగాహన కల్పించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

నోడల్ అధికారులకు కలెక్టర్ మల్లికార్జున ఆదేశం

మహారాణిపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. మార్చి 13న ఎమ్మెల్సీ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నోడల్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీవో, ఏపీవోలకు శిక్షణ తరగతులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. నామినేషన్ల స్వీకరణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేసుకుని సిద్ధంగా ఉండాలన్నారు. డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎస్డీసీలు తదితరులు పాల్గొన్నారు.

- ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అధికారులకు సూచించారు. విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, డీఆర్వోలతో ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ నెల 16 నుంచి ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ ప్రారంభం కానుందన్నారు. నామినేషన్ ప్రక్రియలో ఎటువంటి అవాంతరాలు ఎదురుకాకుండా చూడాలన్నారు.
- స్వర్ణభారతి స్టేడియంను మంగళవారం కలెక్టర్ మల్లికార్జున సందర్శించారు. స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ ఏర్పాట్లు, ఎన్నికల సామగ్రి పంపిణీ కౌంటర్లు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఎక్కడా ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా చర్యలు చేపట్టాలన్నారు. డీఆర్వో, ఆర్డీవోతో పాటు ఎస్డీసీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్, రెవెన్యూ, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

నోడల్ అధికారుల నియామకం

మహారాణిపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా జిల్లాలో నోడల్ అధికారులను నియమిస్తూ కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి 13న ఎమ్మెల్సీ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో.. వివిధ విభాగాలను ఈ నోడల్ అధికారులు పర్యవేక్షించనున్నారు.

- **ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు(ఎంసీసీ), లా అండ్ ఆర్డర్, డిస్ట్రిక్ట్ సెక్యూరిటీ ప్లాన్, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్:** కె.వి.రామలక్ష్మి, ఎస్డీసీ, భూసేకరణ విభాగం సింహాచలం, దేవస్థానం –99852 92437
- **ఎన్నికల కమిషన్‌కు నివేదిక అందజేత/మీడియా సెల్‌కు సమాచారం:** ఎస్.వెంకటేశ్వర్లు, ఎస్డీసీ, ఎన్‌హెచ్ 16– 94411 40194, సీహెచ్ వి.రమేష్, ఎస్డీటీ, ఎన్‌హెచ్ 16 –98499 11018, బి.వి.ఎల్.ఎన్.మూర్తి, ఎస్డీటీ కో–ఆర్డినేషన్(హెచ్)–98495 30239, జె.వి.ఎస్ చంద్రశేఖర్, జేఏ– ఎ సెక్షన్–83411 84778
- **హెల్ప్ డెస్క్:** ఎం.సత్య పద్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(కె.ఆర్.ఆర్.సి)– 9100 064971
- **హెల్ప్ లైన్, ఫిర్యాదులు, మానటరింగ్, కమ్యూనికేషన్ ప్లాన్:** ఎస్.హెచ్.పాషా, అసిస్టెంట్ డైరెక్టర్ ఐవోఎస్– 82478 25057, జె.వి.ఎస్ చంద్రశేఖర్, జె.ఎ, అడ్మిన్ సెక్షన్– 83411 84778
- **మెన్ పవర్ మేనేజ్‌మెంట్:** ఎల్.చంద్రకళ, డీఈవో – 98499 09103, ఆర్.విజయకుమార్, డిస్ట్రిక్ట్ సర్వే, లాండ్ రికార్డ్స్– 98661 69313
- **ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్:** జి.రాజారత్నం, డీటీసీ– 99846 61742, అప్పలనాయుడు, రీజనల్ మేనేజర్, ఆర్టీసీ– 99592 24529
- **ట్రైనింగ్ మేనేజ్‌మెంట్:** డి.హుస్సేన్ సాహెబ్, విశాఖ ఆర్డీవో– 98499 03825, భీమిలి తహసీల్దార్ కె.వేణుగోపాల్ – 80082 05734, ఎస్.హెచ్.పాషా, ఎన్ఐసీ అసిస్టెంట్ డైరెక్టర్– 82478 25057, సీహెచ్ అశోక్, ఈడీఎం 98662 25633
- **మెటీరియల్ మేనేజ్‌మెంట్:** జె.మాధవి, జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్– 93981 19866
- **అబ్జర్వర్‌లు:** డి.హుస్సేన్ సాహెబ్, ఆర్డీవో, ఎస్.వెంకటేశ్వర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, టి.ఆనందకుమార్, తహసీల్దార్, మహారాణిపేట– 9440151095



సమావేశంలో పాల్గొన్న డీఆర్వో శ్రీనివాసమూర్తి, వివిధ పార్టీల నేతలు

- **బ్యాలెట్ పేపర్స్/పోస్టల్ బ్యాలెట్ పేపర్లు:** డి.హుస్సేన్ సాహెబ్, ఆర్డీవో, జె.వి.ఎస్.ఎస్ రామ్మోహనరావు, స్టీల్‌ప్లాంట్ ఎస్డీసీ– 98499 03829
- **మీడియా కమ్యూనికేషన్:** వి.మణిరామ్, సమాచార శాఖ ఉప సంచాలకుడు– 91212 15253
- **కంప్యూటరైజేషన్:** ఎంజీ చంద్రశేఖర్, ఎన్ఐసీ డీఐవో– 94929 25474
- **బ్యాలెట్ బాక్స్ నిర్వహణ:** డి.సత్యనారాయణ, సీఈవో, జిల్లా పరిషత్– 91547 98982, పి.వి.వి.ఎస్ మూర్తి, ఏవో(ప్లానింగ్), జిల్లా పరిషత్– 63037 15547, వి.శ్యామ్ ప్రసాద్, తహసీల్దార్, సీతమ్మధార– 99498 67842

రాజకీయ పార్టీలతో సమావేశం

మహారాణిపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో డీఆర్వో శ్రీనివాసమూర్తి సమావేశమయ్యారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోటీ చేసే వ్యక్తి రాష్ట్రంలో ఏదైనా అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్‌గా నమోదై ఉండాలన్నారు. నామినేషన్ వేసేందుకు జనరల్ కేటగిరీ అభ్యర్థులు రూ.10,000, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5000 దరావత్తును నగదు రూపంలో గానీ చలానా రూపంలో గానీ చెల్లించాలన్నారు. నామినేషన్ దాఖలు సమయంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయం 100 మీటర్లకు వచ్చిన తర్వాత 3 వాహనాలు, అభ్యర్థితో కలిపి ఐదుగురు వ్యక్తులు మాత్రమే రావాలన్నారు. ఒక అభ్యర్థి అత్యధికంగా నాలుగు నామినేషన్లు వేయవచ్చన్నారు. అభ్యర్థి భారత పౌరుడై ఉండాలని, 30 ఏళ్లు నిండాలని సూచించారు. అనంతరం పార్టీల ప్రతినిధుల సందేహాలను నివృత్తి చేశారు. పక్కి దివాకర్(వైఎస్సార్ సీపీ), గంగారామ్(సీపీఎం), లక్ష్మీనారాయణ(బీజేపీ), సుధాకర్(కాంగ్రెస్), చంద్రశేఖర్(సీపీఐ), రమేష్ (బీఎస్పీ), ఎన్నికల విభాగం పర్యవేక్షకులు పాల్ కిరణ్, ఎస్డీసీ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

కొనసాగుతున్న కేజీహెచ్ డైట్ టెండర్ల ప్రక్రియ

మహారాణిపేట: కింగ్ జార్జ్ ఆసుపత్రిలో రోగులకు, డాక్టర్లకు ప్రతిరోజు డైట్ సరఫరా చేయడం కోసం దాఖలు చేసిన టెండర్ల పరిశీలన కొనసాగుతోంది. 9 మంది టెండర్లలో పాల్గొనగా నలుగురిని అర్హులుగా గుర్తించారు. డిస్ట్రిక్ట్ డైట్ మేనేజ్‌మెంట్ కమిటీ నాలుగు టెండర్లను క్షుణ్ణంగా పరిశీలన చేస్తోంది. ఈ నలుగురు వివరాలను తనకు సమర్పించాలని జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్.. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్‌ను ఆదేశించారు.

ఓ వైపు అలజడి.. మరో వైపు ప్రశాంతత



బీచ్‌రోడ్డు: సువిశాలమైన కడలి ఓ సారి భారీ కెరటాలతో 'అల'జడి సృష్టిస్తుంది. ఇంకోసారి ప్రశాంతంగా ఉంటూ ఆహ్లాదం పంచుతుంది. ఈ రెండు సంఘటనలు ఒకే సారి కనిపించడం అసాధ్యం. కానీ ఆర్.కె.బీచ్‌లో సాధ్యమైంది. ఇక్కడ డ్రెడ్జింగ్ పనులు జరుగుతున్నాయి. ఈ మేరకు షిప్ నుంచి ఒడ్డు వరకు పైపులైన్లు వేశారు. దీంతో ఓ వైపు సముద్రంలో అలజడి ఉంటే, మరోవైపు ప్రశాంతత నెలకొంది. ఈ చిత్రం చూసేందుకు ఎంతో ఆసక్తిగా ఉండటంతో.. సందర్శకులు వీడియోలు, ఫొటోలు తీసుకుంటున్నారు. - ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

సింహగిరిపై 'ఆర్‌సీ 15' షూటింగ్

మాడ వీధిలో రామ్‌చరణ్‌పై పాటను చిత్రీకరించిన దర్శకుడు శంకర్

సింహాచలం: ప్రముఖ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా దిల్‌రాజు నిర్మిస్తున్న ఆర్‌సీ 15 చిత్ర షూటింగ్ మంగళవారం సింహగిరిపై జరిగింది. మాడ వీధిలో భారీ ఎత్తున వేసిన సెట్ మధ్య రామ్‌చరణ్‌పై దర్శకుడు శంకర్ ఓ పాటను చిత్రీకరించారు. సుమారు 500 మంది డ్యాన్సర్‌లు విచిత్ర వేషధారణల్లో ఈ పాటలో పాల్గొన్నారు. మధ్యాహ్నం నుంచి కొండదిగువ వరాహ పుష్కరిణి వద్ద ఇదే పాట చిత్రీకరణ కొనసాగింది. రామ్‌చరణ్‌ను చూసేందుకు అభిమానులు సింహగిరి, వరాహ పుష్కరిణి వద్దకు తరలివచ్చారు.

ప్యాన్ ఇండియన్ మూవీ

ఆర్‌సీ 15 సినిమా ప్యాన్ ఇండియన్ మూవీ అని నిర్మాత దిల్ రాజు తెలిపారు. వరాహ లక్ష్మీ నృసింహస్వామిని ఆయన దర్శించుకుని.. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు చేశారు. గోదాదేవి సన్నిధిలో హారతులిచ్చారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదాన్ని ఈవో త్రినాథరావు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్‌సీ 15 చిత్రం నాల్గో షెడ్యూల్ వైజాగ్‌లో జరుగుతోందన్నారు. మరో ఆరు నెలలపాటు షూటింగ్ జరుగుతుందని, ఈ ఏడాది చివర్లో సినిమాను విడుదల చేసే యోచనలో ఉన్నామన్నారు. శాకుంతలం సినిమాను ఏప్రిల్ 14న విడుదల చేస్తామని వెల్లడించారు. 'బలగం'సినిమా విడుదలకు సిద్ధంగా ఉందన్నారు. మరో మూడు సినిమాలు లైనప్‌లో ఉన్నాయని దిల్ రాజు తెలిపారు.



మాడవీధిలో పాట చిత్రీకరణలో పాల్గొన్న డ్యాన్సర్లు

రామ్‌చరణ్ స్టెప్పులు

కొమ్మాది: మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్ డ్యాన్స్ అదుర్స్ అనిపించారు. ఆర్‌సీ 15 సినిమా చిత్రీకరణలో భాగంగా నగరానికి వచ్చిన ఆయన రుషికొండలోని రాడిసన్ బ్లూ రిసార్ట్‌లో బస చేస్తున్న సంగతి తెలిసిందే. కాగా.. ఆయన షూటింగ్ ముగించుకుని సాయంత్రం ప్రముఖ కొరియోగ్రాఫర్ గణేష్ ఆచార్యతో కలిసి సరదాగా కాసేపు స్టెప్పులు వేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. మరో రెండు రోజుల పాటు ఈ సినిమా షూటింగ్ నగరంలో జరగనుంది.

అప్పికొండ తీరంలో ర్యాష్ డ్రైవింగ్

పోలీసుల అదుపులో ముగ్గురు యువకులు

పెదగంట్యాడ: ర్యాష్ డ్రైవింగ్ చేసి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ హెచ్చరించారు. అప్పికొండ తీరంలో సోమవారం నలుగురు యువకులు బైక్ విన్యాసాలు చేయడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. కొంతమంది వీడియోలు తీసి సామాజిక మాధ్యమంలో వైరల్ చేశారు. ఈ ఘటనపై పోలీసులు స్పందించారు. శ్రీనగర్‌కు చెందిన అవినాష్, వర్మ, రోహిత్, రుషి విన్యాసాలు చేసినట్లు గుర్తించారు. వీరిలో ముగ్గురిని మంగళవారం గాజువాక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ త్రినాథ్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలను అతి వేగంగా నడపడం, విన్యాసాలు చేయడం ఇటీవల కాలంలో ఎక్కువైందన్నారు. అతి వేగం ప్రమాదకరమని, దీనిని యువత గుర్తించడం లేదన్నారు. ప్రధాన రహదారుల్లో కూడా దూకుడుగా డ్రైవింగ్ చేయడం ప్రమాదకరన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. అప్పికొండ తీరంలో నలుగురు చేసిన విన్యాసాల కారణంగా స్థానికులు ఆందోళన చెందారని, ఈ నేపథ్యంలో ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

'మెడికవర్'లో ఆరోగ్యశ్రీ అధికారుల తనిఖీ

ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు): వెంకోజీపాలెంలోని మెడికవర్ ఆస్పత్రిలో జిల్లా ఆరోగ్య విభాగం అధికారులు తనిఖీలు నిర్వహించారు. మంగళవారం ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ అశోక్‌బాబు, విశాఖ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ రాజేష్ తదితరులు ఆస్పత్రిని సందర్శించి పలు పత్రాలను తనిఖీ చేశారు. పేషెంట్స్ అడ్మిట్ సమయంలో ఆరోగ్యశ్రీ నమోదుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.. డాక్యుమెంటేషన్‌లో నిబంధనలు పాటిస్తున్నారా లేదా వంటి అంశాలను పరిశీలించారు. ఆస్పత్రిలో ప్రత్యేక విభాగం ద్వారా వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న సేవలను పరిశీలించి డాక్టర్లకు, యాజమాన్యానికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: సికింద్రాబాద్ డివిజన్, కాజీపేట–బల్హార్షా సెక్షన్, మకుడి–విరూర్ స్టేషన్‌ల మధ్య మూడో లైన్ పనులు జరుగుతున్న దృష్ట్యా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. ఈ కింద రైళ్లు వయా విజయనగరం, రాయగడ, టిట్లాఘడ్, రాయ్‌పూర్, నాగ్‌పూర్‌ల మీదుగా ప్రయాణిస్తాయి. ఆయా తేదీల్లో ఈ రైళ్లు అనకాపల్లి, సామర్లకోట, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, ఖమ్మం టైన్, వరంగల్, పెద్దపల్లి, రామగుండం, సిర్పూర్ కాగజ్‌నగర్, బల్హార్షా, చంద్రపూర్, వార్ధా స్టేషన్‌ల మీదుగా ప్రయాణించవు. ఈనెల 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు విశాఖపట్నం–న్యూఢిల్లీ–విశాఖపట్నం(20805/20806) ఏపీ ఎక్స్‌ప్రెస్, ఈనెల 16, 23వ తేదీల్లో విశాఖలో బయల్దేరాల్సిన విశాఖపట్నం– గాంధీదాం (20803) వీక్లీ ఎక్స్‌ప్రెస్, ఈనెల 19న గాంధీదాంలో బయల్దేరాల్సిన గాంధీదాం–విశాఖపట్నం (20804) వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లను దారి మళ్లిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 19న పూరీలో బయల్దేరే పూరీ–ఓఖా (20819) ఎక్స్‌ప్రెస్, ఈనెల 15న ఓఖాలో బయల్దేరే ఓఖా–పూరీ(20820) ఎక్స్‌ప్రెస్ విశాఖపట్నం మీదుగా కూడా ప్రయాణాలు సాగించవని పేర్కొన్నారు.